సాక్షి శ్రీకాకుళం

శుక్రవారం । 8 । ఆగస్టు । 2025



మూల్యాంకన భారం

ఉపాధ్యాయులపై మరో భారం పడింది. మూల్యాంకన పుస్తకాలు జారీ చేశారు.

- 8లో



దారి తప్పతున్న ఎరువులు

ఎరువులు దారి తప్పతున్నాయి. రైతులకు కావాల్సినంత అందడం లేదు.

- 8లో

కాశీబుగ్గలో నేటి ఎస్పీ గ్రీవెన్స్ రద్దు

శ్రీకాకుళం క్రైమ్ : కాశీబుగ్గ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం నిర్వహించాల్సిన మీకోసం (ప్రజా సమస్యల) పరిష్కార వేదిక కార్యక్రమం రద్దు చేస్తున్నట్లు ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. శ్రావణ శుక్రవారం (వర లక్ష్మీ వ్రతం) సందర్భంగా ప్రభుత్వం సెలవుదినం ప్రకటించిందని, ప్రజలు గమనించాలని కోరారు.

న్యూస్‌రీల్

'ఆవిర్భావ వేడుకలు ఘనంగా జరగాలి'



మాట్లాడుతున్న జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా ఏర్పడి 75 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా, ఆగస్టు 13 నుంచి 15 వరకు జరిగే వజ్రోత్సవాలను ఘనంగా నిర్వహించాలని, అందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ తెలిపారు. ఈ ఉత్సవాల ఏర్పాట్లపై గురువారం కలెక్టర్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, జిల్లా ఉన్నతాధికారులు, వివిధ రంగాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ, మూడు రోజుల పాటు జరిగే వేడుకలు జిల్లాలోని సాంస్కృతిక, చారిత్రక, ఆదివాసీ వారసత్వాన్ని ప్రతిబింబించేలా ఉండాలని తెలిపారు. శోభా యాత్రకు బదులు ఐదువేల మందితో మారథాన్, యువజన క్రీడలు, సమ్మిట్, విద్యార్థుల కోసం చరిత్ర, క్విజ్, వ్యాసరచన పోటీలు, ఫైలాన్ ప్రారంభోత్సవం, ఆదివాసీ కళల ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు, డ్వాక్రా బజార్, ఫుడ్ స్టాల్స్ వంటివి ప్రధాన ఆకర్షణగా ఉండనున్నాయి. గ్రామీణ పోటీలు నిర్వహించడం కోసం కమిటీ ఏర్పాట్లు చేయాలన్నారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ దొనక పథ్వీరాజ్ కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు, పలు శాఖల అధికారులు, ఆధ్యాత్మిక, కళా, సేవా రంగాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉల్లాస్ శిక్షణ శిబిరం ప్రారంభం



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ కిరణ్ కుమార్

శ్రీకాకుళం పాతబస్టాండ్: అక్షర ఆంధ్ర (ఉల్లాస్) కార్యక్రమంలో భాగంగా జిల్లా స్థాయిలో ఒకరోజు శిక్షణ శిబిరం జరిగింది. జిల్లా మహిళా సమాఖ్య సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన ఈ శిబిరానికి జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు సంచాలకుడు కిరణ్ కుమార్, ఉపాధి హామీ సంస్థ ప్రాజెక్టు అధికారి సుధాకర్ రావు, గ్రామ సచివాలయాల నోడల్ అధికారి అరుంధతీ దేవి, మున్సిపల్ కమిషనర్ ప్రసాదరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జిల్లాలో 2025–26 విద్యా సంవత్సరానికిగాను 1,12,071 మంది నిరక్షరాస్యులను గుర్తించినట్లు అధికారులు వెల్లడించారు. వీరికి విద్య బోధించడానికి 11,207 మంది వలంటీర్ ఉపాధ్యాయులను నియమించారు. పాఠశాల తరహాలో తరగతులను నిర్వహించి, వచ్చే మార్చి 2026లో నిర్వహించే పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయాలని అధికారులు సూచించారు. ఇందుకోసం పటిష్టమైన ప్రణాళికతో బోధన సాగించాలని చెప్పారు.

వీర్ పరివార్ సహాయత యోజన ప్రారంభం



లీగల్ సర్వీస్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

శ్రీకాకుళం పాతబస్టాండ్: పదవీ విరమణ చేసిన సైనికుల న్యాయ అవసరాల పరిష్కారానికి తోడ్పడేలా 'జాతీయ న్యాయ సేవాధికార సంస్థ వీర్ పరివార్ సహాయత యోజన – 2025' అనే కొత్త పథకాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్రారంభించిందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ అధ్యక్షులు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా తెలిపారు. ఆయన ఈ పథకాన్ని గురువారం స్థానిక జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయంలో లీగల్ సర్వీస్ క్లినిక్ ద్వారా ప్రారంభించారు. ఈ సందర్భంగా లీగల్ సర్వీస్ క్లినిక్‌లో ప్యానెల్ లాయర్, పారా లీగల్ వలంటీర్‌ను నియమించామని తెలిపారు. సేవలను సైనికులు, వారి కుటుంబ సభ్యులు ఉపయోగించుకోవాలని ఆయన తెలిపారు. న్యాయ పరంగా ఎదురయ్యే వివిధ సమస్యలకు ఉచిత సలహాలు, సాయం అందించేందుకు ఈ క్లినిక్ పనిచేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు, ప్యానెల్ అడ్వకేట్ వి. జ్యోతిర్మయి, పారా లీగల్ వాలంటీర్ కె. ఆదిత్య కుమార్, అడ్వకేట్ జి. ఇందిరాప్రసాద్, ఇన్‌చార్జి సూపరింటెండెంట్ ఎస్. ఈశ్వరరావు, మాజీ సైనికులు కెప్టెన్ పి. ఈశ్వరరావు, ఎస్. ఎన్. మూర్తి, కె. పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

- ఇరకాటంలో సచివాలయం ఉద్యోగులు
- పీ–4తో తీవ్రస్థాయిలో ఒత్తిళ్లు
- మార్గదర్శకుల కోసం అన్వేషణ
- కూటమి నాయకులతో సహా ఎవరూ ముందుకు రాని పరిస్థితి
- వెతకలేకపోతే మీరే మార్గదర్శకులుగా చేరాలని ఉద్యోగులపై ఒత్తిడి



ఎందుకీ సతాయింపు..?

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

కూటమి నాయకులు సచివాలయ సిబ్బందికి మొఖం చాటేస్తున్నారు. ఎక్కడ కనిపిస్తే.. ఏం అడుగుతారోనని తప్పించుకుని తిరుగుతున్నారు. అధికారంలోకి వచ్చాక కూటమి నాయకుల హడావుడి అంతా ఇంతా కాదు. గ్రామ, వార్డు సచివాలయాల్లో అంతా తామే అన్నట్టుగా వ్యవహరించారు. సచివాలయాల్లో కూర్చొని అజమాయిషీ చెలాయిస్తూ ఉండేవారు. కానీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న పీ–4(పూర్ టు రీచ్) కార్యక్రమంలో మార్గదర్శకులుగా చేరి, పేద కుటుంబాలను దత్తత తీసుకోవాలని అదే సచివాలయ ఉద్యోగులు కోరితే చాలు ఉడాయిస్తున్నారు. సచివాలయాల వైపే రావడం లేదు.

కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పీ–4 కార్యక్రమానికి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకుల నుంచి వస్తున్న స్పందన ఇది.

తమ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమానికి సొంత పార్టీల నాయకుల నుంచే సహకారం ఉండటం లేదు. పేద కుటుంబాల దత్తత అనే సరికి పారిపోతున్నారు. ఇక, పారిశ్రామిక వేత్తలు, వ్యాపారులు, వైద్యులు ఇలా రకరకాల వ్యక్తులు ఇప్పటికే ఏదో ఒక రకమైన సామాజిక బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. సోషల్ రెస్పాన్సిబులిటీ కింద సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. తమకొచ్చే ఆదాయంలో ఏదొక రకంగా సాయ పడుతున్నారు. ఇలాంటి వారు కూడా పీ–4లో మార్గదర్శకులుగా చేరడానికి ఇష్టపడటం లేదు. తమకు ఇప్పటికే ఆబ్లిగేషన్స్ ఉన్నాయని, ఇంకా చేయడానికి సిద్ధంగా లేమని తేల్చి చెప్పేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పీ–4 కార్యక్రమం ఉద్యోగులకు సవాల్‌గా మారింది.

టార్గెట్లతో నలిగిపోతున్నారు..

పీ–4 కార్యక్రమం తమ చావుకు వచ్చిందనే ఆలోచనలో సచివాలయం ఉద్యోగులు ఉన్నారు. గంటగంటకు టెలీ కాన్ఫరెన్స్ పెట్టి మార్గదర్శకుల గుర్తింపు, పేద కుటుంబాల ట్యాగ్ విషయమై అధికారులు అడుగుతున్నారు. రాత్రి టెలి కాన్ఫరెన్స్ పెట్టి తెల్లవారేసరికి ట్యాగ్ చేసేయాలని టార్గెట్లు ఫిక్స్ చేస్తున్నారు. దీంతో సచివాలయం ఉద్యోగులు పీ–4 అంటే హడలెత్తిపోతున్నారు. జిల్లాలో ఇప్పటివరకు 75,666 పేద కుటుంబాలను సర్వే ద్వారా గుర్తించారు. ఇంకా సర్వే జరుగుతోంది. ఇప్పటివరకు గుర్తించిన వారిలో దత్తత తీసుకునేందుకు 9,745 మంది మార్గదర్శకులను అతి కష్టం మీద పట్టుకున్నారు. వీరికి 43,773 పేద(బంగారు) కుటుంబాలకు ట్యాగ్ చేశారు. మిగతా బంగారు కుటుంబాల కోసం మార్గదర్శకులను గుర్తించే బాధ్యతను సచివాలయం ఉద్యోగుల భుజస్కందాలపై ఉంచారు. ఎవరినో ఒకరిని మార్గదర్శకులుగా గుర్తించి, మమ అనిపించేద్దామని ప్రయత్నిస్తున్నా ముందుకొచ్చే వారు దొరకడం లేదు. సానుకూలంగా స్పందించే వారు కరువయ్యారు. కానీ అధికారులు ఒప్పుకోవడం లేదు. ఏదో ఒకటి చేసి మార్గదర్శకులను తేవాలని, లేదంటే మీరే మార్గదర్శకులుగా ఉండాలని సతాయిస్తున్నారు. ఒక్కొక్కరు రెండేసి పేద కుటుంబాలను ట్యాగ్ చేసుకోవాలని మౌఖికంగా చెబుతున్నారు. ఈ సతాయింపు సచివాలయం ఉద్యోగులు భరించలేకపోతున్నారు.

ఇరుక్కుపోయే సలహాలు..

మార్గదర్శకుల విషయంలో కొంతమంది అధికారులు ఉచిత సలహాలు కూడా ఇస్తున్నారు. ముందు మార్గదర్శకులగా ఎవరో ఒకరిని చేర్పించాలని లేదంటే మీరైనా చేరిపోండని, ముందు చేరిపోతే తర్వాత చూద్దామని ఉచిత సలహాలు ఇస్తున్నారు. జిల్లాలో 6,743 మంది సచివాలయం ఉద్యోగులు ఉన్నారు. వీరిలో అధికారుల ఒత్తిడి మేరకు కొంత మంది మార్గదర్శకులుగా చేరారు. మిగతా వారు కూడా తప్పనిసరిగా చేరాలని ఒత్తిళ్లు వస్తున్నాయి. ఒకసారి మార్గదర్శకులుగా కమిట్ అయితే ప్రభుత్వం చెప్పినట్టు చేయాల్సిందేనని, అధికారులు ఇప్పుడు బాగానే చెబుతారని, తర్వాత ఇరుక్కుపోతామని సచివాలయం ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. వాస్తవంగా సచివాలయం ఉద్యోగికి నెల జీతం రూ. 30వేల లోపే వస్తుంది. చాలీచాలని జీతంతో రెండు పేద కుటుంబాలను దత్తత తీసుకోవడం ఎంత ఇబ్బందో అందరికీ తెలిసిందే. వాస్తవ పరిస్థితులు తెలుసుకోకుండా పీ–4 పేరుతో సతాయిస్తుండటంతో సచివాలయం ఉద్యోగులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు.

మార్గదర్శకులుగా చేరాలంటూ ఒత్తిళ్లు..



ముఖ్యంగా క్షేత్రస్థాయిలో ఉన్న సచివాలయం ఉద్యోగులపై పీ–4 పీక మీద కత్తిలా తయారైంది. క్షేత్రస్థాయిలో స్పందన లేక... ప్రభుత్వం నిర్దేశించిన టార్గెట్‌కు చేరుకోలేక ఒత్తిడికి గురవుతున్నారు. ప్రస్తుతం వారంతా గ్రామాల్లో, వార్డుల్లో మార్గదర్శకుల కోసం వెతుకుతున్నారు. అయినప్పటికీ స్పందన రావడం లేదు. అధికారుల నుంచి ఒత్తిడి ఎక్కువైపోయింది. చివరికి సచివాలయం ఉద్యోగులకు పరోక్షంగా నో ఆప్షన్ ఇచ్చారు. మార్గదర్శకులు చేర్పించాలి, లేదంటే మీరే మార్గదర్శకులుగా చేరాలని అధికారులు ఒత్తిడి చేస్తున్నారు. ఒక్కో సచివాలయం ఉద్యోగి రెండేసి పేద కుటుంబాలను దత్తత తీసుకునేలా ట్యాగ్ చేయాలని మౌఖికంగా ఆదేశిస్తున్నారు.

పాపం.. డిగ్రీ లెక్చరర్లు

- బదిలీలు లేవు, గుర్తింపు లేదు, పట్టించుకున్న నాధుడే లేడు
- జీఓ నంబర్ 42 రద్దు చేయాలని నినదిస్తున్న డీఎల్స్



లీడ్ కాలేజ్ ప్రధాన ద్వారం వద్ద నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న డిగ్రీ లెక్చరర్లు

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రంలో డిగ్రీ చదువులపై కూటమి ప్రభుత్వం శీతకన్ను వేసింది. డిగ్రీ కళాశాలల్లో యూజీ ఫస్టియర్ కోర్సుల్లో ప్రవేశాల జాడే లేదు. దీనికి తోడు ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పని చేస్తున్న లెక్చరర్లను సైతం కనీసం పట్టించుకున్న పాపాన పోవడం లేదు. డిగ్రీ లెక్చరర్లకు బదిలీలు లేవు, వారికి తగిన గౌరవాన్ని, గుర్తింపును ఇవ్వడం లేదు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో 14 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. వీటిలో 130 మంది వరకు రెగ్యులర్(ప్రభుత్వ) డిగ్రీ లెక్చరర్లు పనిచేస్తున్నారు.

బదిలీలు చేసేదెన్నడో.. ?

డిగ్రీ కాలేజీల్లో పనిచేస్తున్న లెక్చరర్లకు బదిలీలు చేపట్టకపోవడాన్ని ఆ సంఘ నాయకులు తీవ్రంగా తప్పుబడుతున్నారు. వాస్తవానికి రాష్ట్రంలో ఏప్రిల్‌లో ప్రభుత్వం సాధారణ బదిలీలకు జీఓ ఇచ్చింది. విద్యాశాఖ, జూనియర్ కాలేజీలతో సహా వివిధ శాఖల్లో బదిలీలను పూర్తిచేశారు. కానీ డిగ్రీ కళాశాలల్లో మాత్రం ఇప్పటి వరకు ఎలాంటి బదిలీలు చేపట్టకపోవడం బాధాకరమని వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గుర్తింపు, గౌరవం ఎప్పుడు..?

2010 రెగ్యులేషన్ యాక్ట్ ప్రకారం డిగ్రీ కాలేజీల్లో పనిచేస్తున్న లెక్చరర్లను రీ–డిజిగ్నేషన్ పేరిట గౌరవించాల్సి ఉంది. డిగ్రీ కాలేజీల్లో డీఎల్స్‌ను అసిస్టెంట్ ప్రొఫెసర్లగా గుర్తించాలి. అలాగే వారి సీనియారిటీ, రీసెర్చ్‌లను ఆధారంగా అసోసియేట్ ప్రొఫెసర్‌గా, ప్రొఫెసర్‌గా మార్చాలి. కానీ రాష్ట్రంలో అవేవీ జరగడం లేదని డీఎల్స్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యూజీసీ నార్మ్స్ ప్రకారం కెరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్ (సీఏఎస్) ప్రతి ఆరు నెలలకు ఒకసారి నోటిఫికేషన్ విడుదల చేస్తుండాలి. ఈ నోటిఫికేషన్ వెలువడుతుంటే.. పే స్కేల్స్, డిజిగ్నేషన్స్ మారుతుంటాయి. కానీ గత ఏడాది నుంచి ఇప్పటి వరకు నోటిఫికేషన్ ఇవ్వకపోవడం శోచనీయమని అంటున్నారు. జీవో నంబర్ 42తో విడుదల చేసిన ఎయిడెడ్ లెక్చరర్ల విషయంలో ప్రభుత్వం వెంటనే చొరవ తీసుకోవాలని.. వెంటనే ఆ జీఓను రద్దుచేయాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల టీచర్స్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

డిగ్రీ లెక్చరర్ల నిరసన..

తమ న్యాయపరమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి న్యాయం చేయాలని శ్రీకాకుళం జి.సి.జి.టి.ఎ, జి.సి.టి.ఎ (ఉమ్మడి జేఏసీ) నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు జిల్లా కేంద్రంలోని లీడ్ కాలేజ్‌గా ఉన్న శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ప్రాంగణంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. అనంతరం జిల్లా జి.సి.టి.ఎ కార్యదర్శి ఎస్.రామకృష్ణ, జి.సి.జి.టి.ఎ కార్యదర్శి రోణంకి రవిశంకర్ నేతృత్వంలో లీడ్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ కణితి శ్రీరాములుకు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం స్పందించకుంటే ఈనెల 18వ తేదీన రాష్ట్ర రాజధానిలో పెద్ద ఎత్తున ధర్నా చేపడతామని అల్టిమేటం జారీ చేశారు. కార్యక్రమంలో కళాశాల సీనియర్ అధ్యాపకులు డాక్టర్ బి.మోహన్‌రావు, డాక్టర్ రోణంకి హరిత, డాక్టర్ వై.పోలినాయుడు, డాక్టర్ ఎం.ప్రదీప్, డాక్టర్ పైడి వెంకటరమణ, డాక్టర్ ఆదినారాయణ, డాక్టర్ రామమూర్తి, అరుణ, రవికుమార్, డాక్టర్ శ్రీనివాస్ పాత్రో తదితరులు పాల్గొన్నారు.



శ్రావణ శోభ

శ్రావణ శుక్రవారం నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని మార్కెట్లు గురువారం కిటకిటలాడాయి. పొట్టి శ్రీరాములు మార్కెట్ ఇలా సందడిగా కనిపించింది.
- సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం

స్వాతంత్య్ర కాలపు సంప్రదాయం

పలాస మండలం కేదారిపురం మహాత్ముని స్మరించుకుంది. స్వాతంత్య్ర కాలం నుంచి కాపాడుకుంటూ వస్తున్న అపురూప సంప్రదాయాన్ని ఈ ఏడాది కూడా కొనసాగించింది. మహాత్మునికి పూజ చేసే గ్రామంగా మన్నన అందుకుంది.



గ్రామ దేవత గాంధమ్మను ఊరేగిస్తున్న మహిళలు



గాంధీ చిత్రపటానికి పూజలు చేస్తున్న గ్రామస్తులు

పలాస: గ్రామంలో గురువారం గాంధమ్మ సంబరాలు ఘనంగా జరిగా యి. వేసవి తర్వాత ఖరీఫ్ సీజన్‌లో వర్షాలు పడాలని, పంటలు బాగా పండాలని ప్రతి గ్రామంలో ఇక్కడ ప్రజల ఆచార సంప్రదాయాలు ప్రకారం గ్రామ దేవతలకు అమ్మవారి సంబరాలు చేయడం ఆనవాయితీ. అయితే ఈ గ్రామం ప్రత్యేకత ఏమిటంటే గ్రామ దేవత గాంధమ్మతో పాటు జాతిపిత మహాత్మాగాంధీకి కూడా గ్రామ దేవతతో పాటు సమానంగా పూజలు చేస్తారు. దేశానికి స్వాతంత్య్రం వచ్చిన తర్వాత నుంచి ఈ విధంగా తాము చేస్తున్నామని స్థానికులు చెప్పారు. దీనికి కారణం కూడా లేకపోలేదు. ఆ గ్రామంలో ఒక భూస్వామికి రైతులకు మధ్య సుదీర్ఘ కాలం భూ పోరాటం జరిగింది. ఈ భూపోరాటం కూడా గాంధీ అడుగు జాడల్లో శాంతి యుతంగా చేపట్టామని, ఇటీవలనే ఆ భూపోరాటం ఫలించిందని ఆ గ్రామానికి గ్రామ పెద్ద పాడి సూర్యనారాయణ చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాడి నారాయణ, పాడి వీరన్న, పాడి రవి, గ్రామస్తులు పాల్గొన్నారు.

11 నుంచి సీజీఆర్‌ఎఫ్ క్యాంపు కోర్టులు

సాక్షి, విశాఖపట్నం: ఏపీఈపీడీసీఎల్ శ్రీకాకుళం, అనకాపల్లి, అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమ గోదావరి, పాడేరు సర్కిళ్ల విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 11 నుంచి క్యాంపు కోర్టులు నిర్వహించనున్నట్లు విద్యు త్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (సీజీఆర్‌ఎఫ్) చైర్మన్ విశ్రాంతి జడ్జి బి.సత్యనారాయణ వెల్లడించారు. ఈ నెల 11న పలాస డివిజన్ కాశీబుగ్గ సెక్షన్, 13న నర్సీపట్నం డివిజన్ కోటవురట్ల సెక్షన్, 21న అమలాపురం డివిజన్ మలికిపురం సెక్షన్, 22న భీమవరం డివిజన్ ఉండి సెక్షన్, 29న రంపచోడవరం డివిజన్‌లోని రాజవొమ్మంగి సెక్షన్ కార్యాలయాల్లో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు జరిగే క్యాంపు కోర్టులో వినియోగదా రులు పాల్గొనవచ్చని తెలిపారు. వినియోగదారులు విద్యుత్ సంబంధిత సమస్యల పరిష్కారం కోసం టోల్ ఫ్రీ నంబర్ 1912 ను సంప్రదించవచ్చని సూచించారు.

కృష్ణాపురంలో వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న తాడివలస పీహెచ్‌సీ డాక్టర్లు



సాక్షిలో ప్రచురితమైన కథనం

సాక్షి ఎఫెక్ట్...

పొందూరు: మండలంలోని కృష్ణాపురం గ్రామంలో 121 మందికి కిడ్నీ వ్యాధి సంబంధిత వైద్యపరీక్షలను తాడివలస పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ నవీన్, డాక్టర్ అనూషలు గురువారం నిర్వహించారు. ఈ నెల 7వ తేదీన 'కృష్ణ.. కృష్ణా' శీర్షికన వార్తా కథనం ప్రచురితం కావడంతో అధికారులు స్పందించి గ్రామంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 121 మందికి కిడ్నీ వ్యాధి పరీక్షలను జరిపేందుకు రక్తనమూనాలను సేకరించి సీరం క్రియాటిన్, బ్లడ్ యూరియా, హిమోగ్లోబిన్, ర్యాండమ్ బ్లడ్ షుగర్ వంటి పలు పరీక్షలను నిర్వహించినట్లు వైద్యాధికారులు తెలిపారు. కార్యక్రమంలో తాడివలస సిబ్బంది గౌరినాయుడు, అరుణకుమార్, రవితేజ, కళ్యాణి పాల్గొన్నారు.

పాపాలు రూపాలు మార్చుకుంటున్నాయి. నేరగాళ్లు తెలివి మీరుతున్నారు. మత్తు పదార్థాలను రవాణా చేయడానికి గమ్మత్తైన మార్గాలను ఎంచుకుంటున్నారు. నిన్న మొన్నటి వరకు జిల్లాలో గంజాయిని ప్యాకెట్లలో విక్రయించేవారు. పోలీసులు పసిగట్టేస్తుండడంతో లిక్విడ్ రూపంలోకి మార్చి అమ్మేవారు. దీనిపై కూడా ఖాకీలు నిఘా వేయడంతో తాజాగా చాక్లెట్ల రూపంలో గంజాయిని చెలామణీ చేస్తున్నారు. వికృత రూపాల్లో సాగుతున్న విక్రయాలు జిల్లాలో శాంతిభద్రతలను ప్రశ్నార్థకం చేస్తున్నాయి.

- రోజుకో రూపంలో గంజాయి అక్రమ రవాణా
- మొన్న ప్యాకెట్లలో.. నిన్న లిక్విడ్ రూపంలో.. నేడు చాక్లెట్లలో
- కొత్త కొత్త ఎత్తులు వేస్తున్న గంజాయి స్మగ్లర్లు



పాపాలు.. బహు రూపాలు



ఆమదాలవలసలో పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి చాక్లెట్లు

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాలో గంజాయి విక్రయాలు కొత్త పుంతలు తొక్కుతున్నాయి. పక్క రాష్ట్రం ఒడిశా నుంచే కాక పాడేరు ఏజెన్సీ ప్రాంతం నుంచి గంజాయి అక్రమంగా మన జిల్లాకు వస్తోంది. మన జిల్లా మీదుగానే ఇతర రాష్ట్రాలైన తమిళనాడు, మహారాష్ట్ర, కర్ణాటక, గుజరాత్ వరకు రవాణా సాగుతోంది. జిల్లా పోలీసులు గంజాయి రవాణాను అరికట్టడానికి తీవ్రంగా కృషి చేస్తున్నారు. కానీ వారి కళ్లు గప్పేందుకు దుండగులు కొత్త కొత్త పద్ధతులు ఎంచుకుంటున్నారు. దీనికి తోడు కొందరు పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లనే ఒడిశా గంజాయి సిక్కోలు మీదుగా హైదరాబాద్, ఇతర నగరాలకు చేరుతోందనే విమర్శ కూడా లేకపోలేదు. రాత్రిపూట ఫింగర్‌ప్రింట్ డివైజ్‌తో బీట్ పోలీసులు తనిఖీలు చేయడం లేదన్న విమర్శలూ ఉన్నాయి.

మూడు రోజులుగా దాడులు

ఒడిశా బోర్డర్ ఆనుకుని ఉన్న ఇచ్ఛాపురం సమీప పురుషోత్తపురం చెక్‌పోస్టు వద్ద, రైల్వే స్టేషన్ వద్ద రెండురోజులకోసారి వందల కిలోల్లో గంజాయి పట్టుబడుతూనే ఉంది. సోమ, బుధవారాల్లో ఆమదాలవలస గాంధీ జంక్షన్, కంద్రపేటలోనే 22 కిలోల గంజాయితో ఎనిమిది మందికి పైగా పట్టుబడగా, ఒక్క మంగళవారం నాడే 53 కిలోల గంజాయిని తమిళనాడు, మహారాష్ట్ర తరలించే క్రమంలో ఇచ్ఛాపురం, కాశీబుగ్గ, శ్రీకాకుళం రూరల్ పోలీసులకు తొమ్మిది మంది పట్టుబడ్డారు. టాస్క్‌ఫోర్సు పోలీసులైతే సుమారు 54 కేసుల్లో 434 కిలోల గంజాయిని పట్టుకున్నారు.



జిల్లా పోలీసు కార్యాలయంలో గంజాయిని చూపిస్తూ.. (ఫైల్)

మొన్న ప్యాకెట్.. నిన్న లిక్విడ్.. నేడు చాక్లెట్..

గతంలో వివిధ ప్రాంతాల నుంచి జిల్లాకు కిలోల్లో వచ్చే గంజాయిని 100 లేదా 200 గ్రాముల ప్యాకెట్లుగానో.. పొట్లాలుగానో.. లేదంటే ఓ చిన్న సీసాలో, గొట్టాంలో లిక్విడ్ గానో ఇక్కడి వ్యసనపరులు పీల్చేవారు. సోమవారం ఆమదాలవలసలో 15 గంజాయి చాక్లెట్లతో శ్రీకాకుళం నగరవాసులు ఆరుగురు దొరకడం విస్మయం కలిగించింది. చిన్న చిన్న పాన్‌షాపుల్లో అమ్మకాలే లక్ష్యంగా చేసుకున్నారు. చాక్లెట్ల రూపంలో గంజాయిని జిల్లాకు తీసుకురాగలిగారు అంటే భయపడాల్సిందే.

రూట్ మార్చారు..

ఒడిశా రాష్ట్రం పర్లాఖిమిడి, గురండి, గారబంద, పాతపట్నం చెక్‌పోస్టును దాటి మందస, గొప్పిలి, బెండిగేట్ తదితర మార్గాల్లో పలాస, కంచిలి రైల్వే స్టేషన్లకు చేరుతుంది. రైళ్లలోనే కాక జిల్లా హైవే మీదుగా సరుకులు రవాణా చేస్తున్న లారీల్లోను, కూరగాయలు తీసుకెళ్లే జీపుల్లోనూ సరుకుల మీద, కింద గంజాయి ప్యాకెట్లు అమర్చి తీసుకెళ్తారు. పాడేరు, అరకు వంటి ఏజెన్సీ ప్రాంతాల నుంచి ఈ తరహాలోనే విశాఖ ఆర్టీసీ కాంప్లెక్సుకు కొందరు తీసుకువస్తే.. అక్కడి నుంచి మన జిల్లా స్మగ్లర్లు వారితో ఉండే ఒప్పందం ప్రకారం కోడ్ భాష ఆధారంగా కార్లు, ద్విచక్రవాహనాల్లో సమయాన్ని మార్చి తెస్తుంటారు. పోలీసులు భోజన విశ్రాంతి మధ్యాహ్న వేళల్లో ఒంటి గంట నుంచి 4 వరకు తనిఖీలు చేయని సమయం చూసి తెస్తారు. వీరికి అడ్డొస్తే ఢీకొట్టే ఘటనలూ గతంలో ఉన్నాయి.

శీలావతి గంజాయికే డిమాండ్..

ప్రధానంగా సాగు చేసే వ్యక్తుల వద్ద సాధారణ గంజాయి కంటే శీలావతి గంజాయికే డిమాండ్ ఎక్కువ. కిలో రూ. 10 వేలు పలుకుతుంది దీని ధర. సాగుదారుల నుంచి కిలో రూ. 500 నుంచి రూ. 1500కు గంజాయి క్వాలిటీ బట్టి కొని అక్కడి నుంచి మన జిల్లాలో ఎంటరయ్యాక రూ. 2,000 నుంచి రూ. 4,000కు అమ్ముతారు. ఇక్కడి నుంచి కిల్లీ దుకాణాల పాడుబడిన బంగ్లాలు, మారుమూల ప్రాంతాలే కాదు శ్మశానాలను సైతం ఆవాసాలుగా చేసుకుని ప్యాకెట్లు, సిగరెట్లు, లిక్విడ్, చాక్లెట్లలో గ్రాముల్లో అదనపు రేటుకు అమ్ముతారు. జైలు శిక్షపై భయం లేకపోవడం, ఈజీగా డబ్బులు వస్తుండడంతో యువత దీనికి బానిసలవుతున్నారు.

జిల్లా కేంద్రంలో చూస్తే..

- పాత దీపా మహల్ థియేటర్ వెనుక రెండు పాన్‌షాపుల్లో దొరికే గంజాయి సిగరెట్లు విద్యార్థులు గోప్యంగా పీల్చుతున్నారు. న్యూకాలనీలో వివాహిత హత్య జరిగిన ప్రాంతంలో ఓ పాన్‌షాపులో సైతం గంజాయి సిగరెట్లు తాగుంటారు.
- అఫీషియల్ కాలనీలో ఓ పాడుబడిన ఇంటిలో గంజాయికు బానిసైన నలుగురు యువత గమ్ము, సిల్వర్ కవర్‌లో పీల్చుతూ పోలీసులకు దొరికారు. గంజాయి కాకపోవడంతో వదిలేశారు.
- ఏపీహెచ్‌బీ కాలనీ సమీప నాగావళి నదీ తీరాన నిత్యం గంజాయి పీల్చుతూ స్థానికులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. మహిళా మాజీ కౌన్సిలర్ ఇంటి సమీపంలో న్యూసెన్సు చేయడంతో పలుమార్లు పోలీసులకు ఫిర్యాదు కూడా చేసింది.
- గుడివీధి, నాగావళి రివర్‌వ్యూ పార్కులో, ఖాళీ ప్రదేశాల్లో రాత్రి వేళల్లో గంజా తాగుతూ యువత కనిపిస్తుంటారు.

మూల్యాంకన భారం!

- ఉపాధ్యాయులపై మరో బోధనేతర కార్యక్రమం
- పరీక్షల సంస్కరణ పేరిట మూల్యాంకన పుస్తకాలు జారీ
- సింగిల్ టీచర్ ఉన్న పాఠశాలల్లో పరిస్థితి దారుణం

నరసన్నపేట:

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నిర్వహించే పరీక్షలకు సంబంధించిన మూల్యాంకన పుస్తకాల పట్ల ఉపాధ్యాయవర్గాల్లో తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. ఇప్పటికే విద్యాశాఖ ఉన్నతాధికారులు ఇస్తున్న పనులను చేయడానికి అధిక సమయం వెచ్చించాల్సి వస్తోందని, తరగతుల బోధనపై దృష్టి పెట్టలేకపోతున్నామని, ఇప్పుడు మూల్యాంకన పుస్తకాల భారం విధించడం తగదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరీక్షల సంస్కరణలు పేరిట ప్రతి విద్యార్థికి ప్రతీ సబ్జెక్టుకు ఒక్కో మూల్యాంకనం పంపిణీ చేసిందని, దీని నిర్వహణ తలకు మించిన భారమవుతుందని అంటున్నారు. ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకూ ఒక్కో విద్యార్థికీ ఆరు చొప్పున మూల్యాంకన పుస్తకాలు పంపిణీ చేస్తుండగా ఫార్మేటివ్ అసెస్‌మెంట్, సమ్మెటివ్ అసెస్‌మెంట్ పరీక్షలను ఈ పుస్తకాల్లోనే విద్యార్థులతో రాయించాలి. రిమార్కులు రాయాలి. అలాగే మూల్యాంకన పుస్తకంపై విద్యార్థులకు అవగాహన కలిగించాలి. మరో పక్క మూడో పేజీలో విద్యార్థుల వివరాలు, అపార్ ఐడీ, పెన్ ఐడీలు నింపాలి. పరీక్ష రాసిన తరువాత వాటిని దిద్ది అందులోనే ఇచ్చిన ఓఎంఆర్ షీట్‌లో మార్కులు వేయడంతో పాటు ఈ పేజీని స్కాన్ చేసి విద్యా శాఖ ఇచ్చిన యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.



మూల్యాంకన పుస్తకాలు

సమయమేదీ?

ప్రభుత్వం విద్యా శాఖ ద్వారా కోట్లు వెచ్చించి ముద్రించి పాఠశాలలకు పంపిణీ చేసిన మూల్యాంకనాలు విద్యార్థులకు ఏ మేరకు ప్రయోజనం కలిగిస్తాయో తెలీదు గాని ఉపాధ్యాయులపై మాత్రం పని భారం తప్పడం లేదు. మూల్యాంకనాలు నింపేందుకు, విద్యార్థులు రాసిన పేపరు దిద్దేందుకు అంత సమయం ఎక్కడుందని ఉపాధ్యాయులు ప్రశ్నిస్తున్నారు. ఉన్నత పాఠశాలల్లో ఒక ఉపాధ్యాయుడు నాలుగైదు తరగతులకు వెళ్తే ఆయా విద్యార్థుల మూల్యాంకణాలు సరి చేసేందుకు రోజుల సమయం పడుతుంది. ఇక పాఠాలు బోధన ఎప్పుడు చేస్తారని వాపోతున్నారు. జిల్లా వ్యాప్తంగా అనేక చోట్ల సింగిల్ టీచర్లు ఉన్నారు. వీరి పరిస్థితి మరింత దారుణం. ప్రాథమిక దశలో ప్రతి విద్యార్థికీ మూడేసి మూల్యాంకనాలు సరఫరా చేశారు. ఇవన్నీ ఒక టీచర్ ఎప్పుడు దిద్దుతారు.. ఎప్పుడు అప్‌లోడ్ చేస్తారు.. విద్యార్థులకు తరగతుల బోధన ఎప్పుడు చేస్తారని ఉపాధ్యాయులు ప్రశ్నిస్తున్నారు.

ఆలోచించరా..?



పరీక్షల నిర్వహణలో సంస్కరణలు మంచివే. అయితే వాటిని అమలు చేసేటప్పుడు సాధ్యాసాధ్యాలపై ఆలోచించాలి. నిపుణులతో చర్చించాలి. అలాకాకుండా ఏకపక్షంగా రుద్దితే అయ్యే పనికాదు. ఒక వైపు బోధనేతర కార్యక్రమాలు ఉపాధ్యాయులను ఊపిరి సలపనివ్వడం లేదు. ఇంకో పక్క టీచర్ హేండ్ బుక్స్.. ఇప్పుడు మూల్యాంకణ పుస్తకాలు. ప్రభుత్వం పునరాలోచన చేయాలి. – బమ్మిడి శ్రీరామమూర్తి, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

అంతా గందరగోళం..



కొత్త పుస్తకాలు, పరీక్షల్లో మార్పులు ఉపాధ్యాయులకు తలకు మించిన భారంగా మారుతున్నాయి. ఒకటో తరగతి నుంచి తొమ్మితో తరగతి వరకూ ఒక ప్యాట్రిన్, పదో తరగతికి మరో ప్యాట్రిన్ అసెస్‌మెంట్ పుస్తకాలు గందరగోళానికి గురిచేస్తున్నాయి. ఓఎంఆర్ షీట్‌ను అప్‌లోడ్ చేయాలనడం, దిద్దిన ప్రతి ప్రశ్నకూ స్కోరింగ్ ఇవ్వడం, ఎందుకు ఇచ్చారో వివరణ ఇవ్వడం పని భారం పెంచుతుంది. – తమ్మినేని చందనరావు, ఏపీఎస్టీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

బోధనకు సమయమేదీ?



సంస్కరణల పేరిట విద్యార్థులకు మేలు జరగాలే గానీ కీడు జరగకూడదు. ఈ మూల్యాంకన విధానంతో ఉపాధ్యాయులపై అదనపు భారం తప్ప ప్రయోజనం తక్కువ. దీనికితోడు బోధనా కాలం హరిస్తుంది. ఈ ప్రభావం ముమ్ముందు విద్యా ప్రమాణాలపై తీవ్రంగా పడుతుంది. – బి.వెంకటేశ్వర్లు, ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

వ్యక్తి అనుమానాస్పద మృతి

పాతపట్నం: పాతపట్నం మేజర్ పంచాయతీ హరిజన వీధి సమీపంలోని మహేంద్రతనయా నదికి వెళ్లే దారిలో మొండిగలవీధికి చెందిన నల్లి రాజా (34) అలియాస్ రాజు అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. గురువారం తెల్లవారుజామున మృతదేహం వెలుగుచూడటంతో పాతపట్నంలో కలకలం రేపింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజా చిన్న చిన్న రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేస్తుండేవాడు. బుధవారం రాత్రి ఇంట్లో భోజనం చేసి పది గంటల సమయంలో బయటకు వెళ్లాడు. గురువారం తెల్లవారుజామున 4.45 గంటల సమయంలో నది వద్ద విగతజీవిగా మారడంతో స్థానికులు గుర్తించి కుటుంబ సభ్యులకు తెలియజేశారు. వెంటనే కుటుంబ సభ్యులు రాజాను పాతపట్నం సీహెచ్‌సీకి ఆటోలో తీసుకువెళ్లగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు తెలిపారు. సమాచారం అందుకున్న పాతపట్నం సీఐ వి.రామారావు, ఎస్‌ఐ బి.లావణ్య, మెళియాపుట్టి ఎస్‌ఐ రమేష్‌బాబు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. శ్రీకాకుళం క్లూస్ టీం బృందం, టెక్కలి డీఎస్పీ డి.లక్ష్మణరావులు పాతపట్నం చేరుకుని ఆరా తీశారు. మూడు బృందాలుగా విడిపోయి సీసీ పుటేజ్, సెల్‌ఫోన్ కాల్‌డేటాను పరిశీలిస్తున్నారు. శ్రీకాకుళం రిమ్స్‌లో పోస్టుమార్టం అనంతరం మృతదేహన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. రాజాకు భార్య మౌనిక, పిల్లలు ధనుష్, సాత్విక్ ఉన్నారు. మౌనిక ఫిర్యాదు మేరకు అనుమానాస్పద కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ లావణ్య తెలిపారు.





మృతదేహం లభ్యమైన స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ రామారావు, (ఇన్‌సెట్లో) నల్లి రాజా (ఫైల్)

డిపోను విభజిస్తే సహించేది లేదు

ఎచ్చెర్ల: ఎచ్చెర్ల ఐఎంఎల్ డిపోను విడదీస్తే సహించేది లేదని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు అన్నారు. ఎచ్చెర్ల ఐఎంఎల్ డిపో విభజన చేపట్టి టెక్కలిలో ఏర్పాటు చేయడాన్ని నిరసిస్తూ ఎచ్చెర్ల బేవరేజ్ కార్పొరేషన్ వద్ద చేపడుతున్న ధర్నా కార్యక్రమంలో భాగంగా గురువారం ఖాళీ ప్లేట్లతో హమాలీలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మన్నాయుడు మాట్లాడుతూ పేదల భూములు తీసుకుని పరిహారంగా ఉపాధిని కల్పించి ఇప్పుడు ఆయా కుటుంబాలు ఉపాధి కోల్పోయేలా ఉత్తర్వులు జారీచేయడం అన్యాయమన్నారు. అవసరం లేకున్నా డిపోను విడదీసి పొట్టలు కొట్టవద్దన్నారు. మంత్రి అచ్చెన్నాయుడు దళితులకు అన్యాయం చేయడం తగదన్నారు. నిరసన కార్యక్రమంలో హమాలీ యూనియన్ నాయకులు డి.బంగారాజు, టి.రామారావు, ఎం.సురేష్, ఎస్.రమణ, బోనెల రాము, లింగాల రాము, జి.గురుమూర్తి, పట్నాన రామారావు, ఎల్.సీతారాం, రాజు, కె.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.



ఖాళీ ప్లేట్లతో నిరసన తెలుపుతున్న హమాలీలు

ప్రమాద బీమా.. ఆరోగ్యానికి ధీమా



మీకు తెలుసా

- ఉద్యోగులకు వరంలా ఎస్‌బీఐ శాలరీ అకౌంట్
- సద్వినియోగం చేసుకోవాలంటున్న అధికారులు

శ్రీకాకుళం: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అనేక ప్రయోజనాలను చేకూర్చే శాలరీ అకౌంట్(జీతం ఖాతా)ను అందుబాటులోనికి తీసుకొచ్చింది. ఇతర బ్యాంకుల్లో శాలరీ అకౌంట్‌లో ఉన్నవారు, ఎస్‌బీఐలో శాలరీ అకౌంట్‌ను తెరుచుకున్నా ఇప్పటికే ఎస్‌బీఐలో అకౌంట్లో ఉన్న ఉద్యోగులు ఆ ఖాతాను స్టేట్ గవర్నమెంట్ శాలరీ అకౌంట్కు మార్చుకున్నా అనేక ప్రయోజనాలు చేకూరుతాయి. మినిమం బాలెన్స్ నిర్వహించక్కర్లేదు. ప్రమాదంలో మరణిస్తే కోటి రూపాయల బీమా అందజేస్తారు. ప్రమాదంలో పూర్తి అంగవైకల్యం పొందితే కోటి రూపాయలు, పాక్షికంగా అంగవైకల్యం పొందితే 20 లక్షలు బీమాగా ఇస్తారు. గ్రూప్ టర్మ్ ఇన్సూరెన్సా పది లక్షల రూపాయలు అందజేస్తారు. ఆరోగ్యబీమాను కూడా ఈ అకౌంట్ ద్వారా అందిస్తారు. నగదు బదిలీ, డీడీలకు బ్యాంకు చార్జీలు తీసుకోరు. ఏటీఎం లావాదేవీలు అపరిమితం. ఆన్‌లైన్ కొనుగోళ్లకు రాయితీలు పొందే అవకాశం ఉంటుంది. ఈ అకౌంట్ కోసం పూర్తి వివరాలకు సమీపంలోని ఎస్‌బీఐ బ్రాంచి మేనేజర్లను సంప్రదించవచ్చు. మార్చి నుంచే ఈ ఖాతాను అమలు చేస్తుండగా ఉద్యోగస్తులకు అవగాహన లేకపోవడంతో ఇప్పటివరకు 25 శాతం మంది మాత్రమే వినియోగించుకున్నట్లు జిల్లాలోని బ్యాంకు వర్గాలు చెబుతున్నాయి.

క్లుప్తంగా

దేహదారుఢ్యంపై అవగాహనకు పాదయాత్ర



జాతీయ జెండాతో అభిరామ్ సత్‌పతి

ఇచ్ఛాపురం: దేహదారుఢ్యానికి ప్రతిఒక్కరూ వ్యాయామం చేయాలని అవగాహన కల్పిస్తూ ఒడిశా రాష్ట్రం కటక్ జిల్లాలోని ఝూర్సిగూడ దుర్లఘ గ్రామానికి చెందిన అభిరామ్ సత్‌పతి అనే 68 ఏళ్ల రిటైర్డ్ ఉద్యోగి దేశవ్యాప్తంగా పాదయాత్రకు శ్రీకారం చుట్టారు. 2023 మే 25న పాదయాత్ర ప్రారంభించి గురువారం ఇచ్ఛాపురం చేరుకున్నారు. మొత్తం 16,100 కిలోమీటర్ల మేర పాదయాత్ర చేయనున్నట్లు అభిరామ్ పేర్కొన్నారు.

టిప్పర్ ఢీకొని వ్యక్తి దుర్మరణం



ఘటనా స్థలంలో రాజేంద్రప్రసాద్ చౌదరి మృతదేహం

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఒడిశా రాష్ట్రం బౌద్ధ జిల్లా బౌద్ మున్సిపాలిటీకి చెందిన రాజేంద్రప్రసాద్ చౌదరి(69) శనివారం తన జీపులో కాశీనగర్ సమీపంలోని కొల్లహరిపురం వద్ద పొలాలను చూడటానికి వెళ్లాడు. పనులు ముగించుకొని స్వగ్రామానికి వస్తుండగా.. బెల్లుపడ పాత టోల్‌ప్లాజా సమీపంలో రాంగ్‌రూట్‌లో నిర్లక్ష్యంగా వచ్చిన టిప్పర్ ఢీకొట్టింది. ఈ ఘటనలో జీప్ నడుపుతున్న హరిప్రసాద్ అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. హరిప్రసాద్ కుమారుడు చిన్నయ్య చౌదరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్సై చక్రధర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహన్ని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఎల్‌ఐపీ కొనసాగించాలని వినతి

ఎచ్చెర్ల : డిగ్రీ చదువుతున్న విద్యార్థులకు స్వల్పకాలిక ఇంటర్న్‌షిప్ కింద కమ్యూనిటీ సర్వీసెస్ కార్యక్రమాన్ని కూడా భాగం చేయాలని సంబంధిత అధికారులు గురువారం డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య కె.ఆర్.రజనీ, రిజిస్ట్రార్ పి.సుజాతలను గురువారం విజ్ఞప్తి చేశారు. యూనివర్శిటీ పరిధిలో గత ఏడాది 25 డిగ్రీ కాలేజీల్లో 'ప్రేరణమిత్ర' యాప్ ద్వారా లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రామ్(ఎల్‌ఐపీ) విజయవంతంగా అమలయ్యిందని, ఈ విద్యా సంవత్సరంలోనూ దీనిని కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో యూనివర్శిటీ బోర్డు ఫర్ డెవలప్‌మెంట్ త్రూ ఎడ్యుకేషన్ కో–ఆర్డినేటర్ బి.అజయకుమార్, శిక్షణా ఫౌండేషన్ ఆపరేషన్ మేనేజర్ ఆర్.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నీలమణి అమ్మవారికి నోట్ల అలంకరణ

సారవకోట మండలం అవలింగిలోని నీలమణి ఆలయంలో అమ్మవారిని గురువారం కరెన్సీ నోట్లతో అలంకరించారు. వరలక్ష్మి వ్రతం పురస్కరించుకుని రూ.2,11,116 విలువైన వివిధ నోట్లతో అలంకరించినట్లు అర్చకులు భాస్కరాచార్యులు తెలిపారు. శుక్రవారం ఆలయ ప్రాంగణంలో సామూహిక కుంకుమార్చనలు నిర్వహించనున్నట్లు చెప్పారు. – సారవకోట



విప్లవోద్యమంలో త్యాగాలు అనివార్యం



సురేఖ పాణిగ్రాహి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

పలాస: విప్లవోద్యమంలో ప్రాణత్యాగాలు అనివార్యమని, అందుకు అనేక కుటుంబాలు ఎన్నో కష్టాలను మౌనంగా భరించాయని, అలాంటి వారిలో సుబ్బారావు పాణిగ్రాహి సతీమణి సురేఖ పాణిగ్రాహి ఒకరని పలువురు వక్తలు కొనియాడారు. పలాస మండలం బొడ్డపాడు అమరవీరుల స్మారక మందిరం వద్ద గురువారం సుబ్బారావు పాణిగ్రాహి సతీమణి సురేఖ సంతాప సభ నిర్వహించారు. అమరుల బంధుమిత్రుల కమిటీ నాయకుడు తామాడ త్రిలోచనరావు అధ్యక్షతన జరిగిన ఈ సభలో సి.పి.ఐ.ఎం.ఎల్ లిబరేషన్ సీనియర్ నాయకుడు మద్దిల మల్లేశ్వరరావు, విరసం రాష్ట్ర నాయకుడు అరసవెల్లి కృష్ణ, అరుణోదయ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నశెట్టి రాజశేఖర్, ప్రజాసంఘాల నాయకులు తామాడ అరుణ, పోతనపల్లి అరుణ, పోతనపల్లి కుసుమ, మద్దిల రామారావు, జోగి కోదండరావు, వంకల మాధవరావు, నిరంజన్ పాణిగ్రాహి, చింతాడ కృష్ణారావు, పత్తిర దానేసు, డి.హరనాడ్, డి.వర్మ, కొర్రాయి నీలకంఠం, కోనేరు రమేష్ పాల్గొన్నారు.

నేడు టీటీడీ 'సౌభాగ్యం'

శ్రీకాకుళం కల్చరల్ : తిరుమల తిరుపతి దేవస్థానాలు, హిందూ ధర్మ ప్రచార పరిషత్ శ్రీకాకుళం శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం 'సౌభాగ్యం' పేరిట ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు హిందూ ధర్మప్రచార పరిషత్ ప్రోగ్రాం ఆర్గనైజర్ ఎం.లలితమణి ఒక ప్రకటనలో తెలిపారు. వరలక్ష్మీ వ్రతం నేపథ్యంలో ఎచ్చెర్ల మండలం కుంచాల కుర్మయ్యపేటలోని ఏకోత్తర శ్రీచక్రపీఠం దేవీ ఆశ్రమంలో ఉదయం 10 గంటలకు మహిళలతో సామూహిక కుంకుమార్చన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మహిళలకు దేవస్థానం వారిచే గాజులు, పసుపు, కుంకుమ, రక్ష కంకణాలు, జాకెట్ పీస్, నల్ల పూసలు, పుస్తక ప్రసాదం ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం దాతల ద్వారా స్వచ్ఛందంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

దారితప్పుతున్న ఎరువులు!

- ఆమదాలవలసలో రైల్వే అధికారులతో వ్యాపారుల కుమ్మక్కు
- రైతు భరోసా కేంద్రాల పేరుతో పక్కదారి
- ఉన్నతాధికారుల ఆదేశాలు బేఖాతరు

ఆమదాలవలస రూరల్: కొందరు వ్యవసాయాధికారులు, రైల్వే అధికారులు, వ్యాపారులు కుమ్మక్కు కావడంతో అన్నదాతలకు అందాల్సిన ఎరువులు పక్కదారి పడుతున్నాయి. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలను సైతం బేఖాతరు చేస్తుండటంతో రైతులకు సక్రమంగా ఎరువులు అందని పరిస్థితులు నెలకొన్నాయి. ఇందుకు ఆమదాలవలసలోని రైల్వే గూడ్స్‌షెడ్ గోదాములు వేదికగా నిలుస్తున్నాయి. కొందరు వ్యవసాయాధికారుల అండగతో.. ఎరువులు కంపెనీ అధికార, సిబ్బందితో కొందరు అక్రమ వ్యాపారులు చేతులు కలిపి ఎరువులను దారి మళ్లిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.



ఆమదాలవలస రైల్వేస్టేషన్ గూడ్స్‌షెడ్ వద్ద క్యూకట్టిన లారీలు

తరలింపులోనే తతంగమంతా..

ఆమదాలవలస రైల్వేవ్యాగన్‌కు వచ్చిన ఎరువులను తరలించే సమయంలో పలు అక్రమాలు చోటుచేసుకుంటున్నాయి. కొందరు వ్యాపారులు అధికారులతో కుమ్మక్కై నిబంధనలకు విరుద్ధంగా ఎరువులు తరలిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. వాస్తవంగా రైల్వే ఫ్లాట్‌ఫారంపై వచ్చిన ఎటువంటి వ్యాగన్ అయిన పెట్టెలను బట్టి సుమారు 5 గంటల నుంచి 8 గంటలలో ఖాళీచేయాలనేది రైల్వే నిబంధన. అయితే వ్యాగన్ వచ్చిన సమయం ఖాళీచేసిన సమయం రైల్వేస్టేషన్ అధికారులు నిర్ధారించాల్సి ఉంటుంది. అయితే రైల్వే అధికారులు మాత్రం ఎరువులు కంపెనీ యజమానులతో కుమ్మక్కై అయ్యి ఫ్లాట్‌ఫారం ఖాళీ లేదని చెప్పి, ఎటువంటి అపరాధ రుసుము కూడా వేయకుండా లోపాయికారి ఒప్పందాలు చేసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో బుధవారం మధ్యాహ్నం రావాల్సిన వ్యాగన్‌ను సాయంత్రం ఆరు గంటలకు తెప్పించారు. కూలీలు లేరనే సాకుతో గురువారం వేకువజామున ఖాళీ చేయించారు. ఈ సమయంలోనే అక్రమాలు జరుగుతున్నాయని పలువురు చెబుతున్నారు.

అంతా గూడ్స్‌గోదాం నుంచే..!

అక్రమ ఎరువులు తరలింపు అంతా రైల్వేగూడ్స్‌షెడ్ గోదాం నుంచే జరుగుతోందనేది బహిరంగ రహస్యం. వివిధ కంపెనీల అధికారులతో వ్యాపారులు ఒప్పందం కుదుర్చుకొని అక్రమ తరలింపులకు పాల్పడుతున్నారనే విమర్శలు జోరుగా వినిపిస్తున్నాయి. వాస్తవంగా రైల్వే ఫ్లాట్‌ఫాం వద్ద అక్రమ ఎరువులు తరలింపు అవకాశం అంతంతమాత్రమే ఉండగా.. గోదాం నుంచి ఎక్కువ శాతం అక్రమంగా తరలించేఅవకాశం ఉంటుంది. గోదాం నుంచి రాత్రిపూట ఈ తరలింపులు జరుగుతాయనే వాదనలు ఉన్నాయి. అంతా కలసికట్టుగానే ఈ వ్యవహారం సాగిస్తున్నారనేది స్థానికుల మాట.



రైల్వే ప్లాట్‌ఫారం వద్దకు చేరుకున్న లారీలు

ఆ విషయం తెలియదు..

సకాలంలో రైలు వ్యాగన్ రాకుండా ఎరువులను పక్కదారి పట్టించటంలో పలువురు అధికారులు కీలకంగా వ్యవహరిస్తున్నారనే విషయమై శ్రీకాకుళం గూడ్స్‌షెడ్(ఆమదాలవలస) సూపర్ వైజర్ శివశంకర్ వద్ద 'సాక్షి' ప్రస్తావించగా రైల్వే గూడ్స్ వ్యాగన్ ఏ సమయానికి వస్తోందో ఏ సమయానికి పోతుందో అన్న విషయం తనకు తెలియదని చెప్పారు. ఆ విషయం రైల్వే స్టేషన్ అధికారులకే తెలుస్తుందని సమాధానం దాటవేశారు.

శ్రీకాకుళం పర్యాటక స్థలాలపై ప్రత్యేక బ్రోచర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: శ్రీకాకుళం జిల్లా ఆవిర్భవించి 75 సంవత్సరాలు పూర్తిచేసుకుని వజ్రోత్సవాలు నిర్వహించుకుంటున్న సందర్భంగా జిల్లాలోని చారిత్రక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక, భౌగోళిక ప్రాధాన్యత కలిగిన ప్రధాన ఆకర్షణీయ ప్రదేశాల వివరాలతో రూపొందించిన ప్రత్యేక బ్రోచర్‌ను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ గురువారం ఆవిష్కరించారు. ఇంటాక్ శ్రీకాకుళం శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన ఈ బ్రోచర్‌లో జిల్లా విశిష్టతను ప్రతిబింబించే ఆలయాలు, కోటలు, తీర్థక్షేత్రాలు, ప్రకృతి అందాలు, ఆదివాసీ ప్రాంతాలు, సాంస్కృతిక కేంద్రాల విశేషాలు పొందుపరిచారు. ఈ సందర్భంగా ఇంటాక్ కన్వీనర్ నూక సన్యాసిరావు, కో–కన్వీనర్ నటుకుల మోహన్, అదనపు కన్వీనర్ వావిలపల్లి జగన్నాథంనాయుడు మాట్లాడుతూ 'దర్శించండి, ఆనందించండి, తరించండి' అనే నినాదంతో ఈ బ్రోచర్‌ను ప్రజల ముందుకు తెచ్చామని చెప్పారు. కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు, రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ పి.జగన్మోహనరావు, సీపీఓ ప్రసన్నలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



బ్రోచర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్, ఎమ్మెల్యే, ఇన్‌టాక్ ప్రతినిధులు

వ్యక్తి ఆత్మహత్య

సరుబుజ్జిలి: తురకపేట గ్రామానికి చెందిన గదిలి రమణమూర్తి(52) బుధవారం పురుగుల మందు తాగాడు. వెంటనే భార్య గమనించి శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రికి తరలించగా మెరుగైన చికిత్స కోసం విశాఖ కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. అక్కడికి తీసుకెళ్తుండగా మృతిచెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మృతదేహానికి గురువారం పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై బి.హైమావతి తెలిపారు.

పది కేజీల గంజాయితో యువకుడు అరెస్టు

ఇచ్ఛాపురం: ఒడిశా నుంచి మహారాష్ట్రకు గంజాయి తరలించేందుకు ప్రయత్నించిన వ్యక్తిని ఇచ్ఛాపురం రూరల్ పోలీసులు అరెస్టు చేసినట్లు డీఎస్పీ వి.వెంకటఅప్పారావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఇచ్ఛాపురం సీఐ కార్యాలయంలో విలేకరులకు వివరాలు వెల్లడించారు. మహారాష్ట్రకు చెందిన విశాల్ రమేష్ ఒడిశాలోని గజపతి జిల్లాకి చెందిన జిత్తు వద్ద 10 కేజీల180 గ్రాముల గంజాయిని కొనుగోలు చేశాడు. ఒడిశా నుంచి బస్సులో ఇచ్ఛాపురం చేరుకొని రైలు ద్వారా మహారాష్ట్రలోని అతని బంధువు గణపత్ అనే వ్యక్తి ఇవ్వడానికి వెళ్తుండగా స్థానిక ఎల్‌సీ గేటు వద్ద రూరల్ పోలీసులకు పట్టుబడ్డాడు. బ్యాగ్‌ను తనిఖీచేయగా గంజాయి పట్టుబడింది. సమావేశంలో సీఐ మీసాల చిన్నంనాయుడు, రూరల్ ఎస్సై శ్రీనివాసరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకట అప్పారావు